ఉత్కంఠగా పార్వేట





పాలపాటిదిన్నె ఆంజనేయస్వామి ఆలయ ప్రాంగణంలో పార్వేట కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

నల్లచెరువు: మండలంలో ప్రసిద్ధి చెందిన పాలపాటిదిన్నె ఆంజనేయ స్వామి ఆలయంలో సంక్రాంతి పండుగను పురస్కరించుకుని బుధవారం ఈఓ రవీంద్రరాజు ఆధ్వర్యంలో నిర్వహించిన పార్వేట మహోత్సవం ఉత్కంఠగా సాగింది. తొలుత ఆలయంలో స్వామివారికి అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పార్వేటలో భాగంగా ఆచారం ప్రకారం ఆలయ ప్రాంగణంలో కుందేలును జనం మధ్యకు వదిలారు. దానిని పట్టుకోవడానికి యువకులు పోటీ పడ్డారు. ఈ ఉత్సవాన్ని చూడడానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. భక్తులకు ఆలయ అధికారులు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

చంద్రాయునిస్వామికి ప్రత్యేక పూజలు

కదిరి టౌన్: కుటాగుళ్లలో సంక్రాంతి పండుగ రోజున చంద్రాయుని స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. వాల్మీకి సంఘం ఆధ్వర్యంలో దేవరెద్దును ఊరేగించారు. అనంతరం చంద్రాయుని స్వామి పార్వేటను దేవుని మాన్యంలో నిర్వహించారు. భక్తుల సమక్షంలో వదిలిన కుందేలును యువకులు పోటీపడి లాక్కున్నారు. కార్యక్రమంలో వాల్మీకి సంఘం నాయకులు గంగరాజు, చెన్నప్ప, కేశవులు, పెద్దోడు, గంగన్న తదితరులు పాల్గొన్నారు.



కుటాగుళ్లలో దేవరెద్దును ఊరేగిస్తున్న దృశ్యం

భక్తిశ్రద్ధలతో మారెమ్మ జాతర



ముదిగుబ్బ: మండల పరిధిలోని పొడరాళ్లపల్లి, పూజారి తండా, రామస్వామి తండా, ఏబీపల్లి తండాల్లో మంగళవారం మారెమ్మ జాతర భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అమ్మవారిని వెండి ఆభరణాలు, వివిధ రకాల పుష్పాలతో అలంకరించి విశేష పూజలు చేశారు. జాతరకు ఉమ్మడి తెలుగు రాష్ట్రాలతో పాటు కర్ణాటక తదితర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. అమ్మవారికి జంతు బలులు ఇచ్చి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఆలయ కమిటీ సభ్యులు అన్ని ఏర్పాట్లు చేశారు.



పల్లకీలో అమ్మవారి ఊరేగింపు

గంగమ్మకు సూర్యాభిషేకం



గంగమ్మ తల్లి పాదాలను తాకిన సూర్యకిరణాలు

బత్తలపల్లి: మండల కేంద్రమైన బత్తలపల్లి కూడలిలో వెలసిన గంగమ్మ తల్లి పాదాలను సూర్యకిరణాలు తాకాయి. మకర సంక్రాంతి రోజైన మంగళవారం అమ్మవారి పాదాలను సూర్య కిరణాలు తాకడంతో భక్తులు పరవశంలో మునిగిపోయారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు.

కందిలో పంటకోత ప్రయోగాలు



పంటకోత ప్రయోగాలను పర్యవేక్షిస్తున్న అధికారులు

బత్తలపల్లి: గరిశలపల్లిలో దంపెట్ల సర్వే నంబర్ 192–ఈలో బుధవారం ఏఎస్ఓ డాక్టర్ లక్ష్మీనరసింహాశర్మ ఆధ్వర్యంలో ఎంపీఈఓ రవి కందిలో పంటకోత ప్రయోగాలు నిర్వహించారు. ప్రయోగాలను బీమా కంపెనీ కో ఆర్డినేటర్‌లు మంజునాథ్, హుసేన్ పర్యవేక్షించారు. కార్యక్రమంలో రైతు సంఘం అధ్యక్షులు క్రిష్ణయ్య, వెంకటనారాయణ, పెద్దన్న, శ్రీనివాసులు, నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ముగిసిన ఎడ్లబండ్ల పోటీలు



ప్రథమ స్థానంలో నిలిచిన ఎద్దుల యజమాని గురుకు నగదు బహుమతి అందజేస్తున్న దృశ్యం

కదిరి అర్బన్: పట్నం సమీపంలో రెండు రోజులుగా జరుగుతున్న ఎడ్లబండ్ల పోటీలు బుధవారం ముగిశాయి. పట్నం గ్రామానికి చెందిన గురు ఎద్దులు ప్రథమ స్థానంలో నిలిచాయి. బుల్లెట్ రాఖీ బూసేపల్లికి చెందిన రైతు ఎద్దులు ద్వితీయ స్థానం, కొత్తచెరువుకు చెందిన దేవ సుల్తాన్ ఎద్దులు మూడో స్థానం, కొత్తచెరువు నాగన్నకు చెందిన ఎద్దులు నాలుగో స్థానం, కొత్తచెరువు రాణా టీం ఎద్దులు ఐదో స్థానం సాధించాయి. విజేత ఎద్దుల యజమానులకు వరుసగా రూ.40వేలు, రూ.30వేలు, రూ.20వేలు, రూ.10వేలు, రూ.5 వేలు చొప్పున నగదు బహుమతులు అందజేశారు. పోటీలను ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరై తిలకించారు. కార్యక్రమంలో ప్రసాద్, కృష్ణానాయక్, బాలాజీనాయక్ తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్ప స్వామి ఆలయంలో అఖండజ్యోతి



ఎం.కొత్తపల్లి బండపై అయ్యప్పస్వామి ఆలయంలో వెలుగుతున్న అఖండజ్యోతి

ఓడీచెరువు : సంక్రాంతి రోజున శబరిమలలో కనిపించే మకరజ్యోతికి గుర్తుగా ఓడీచెరువులోని అయ్యప్పస్వామి ఆలయంలో అఖండజ్యోతి వెలిగించారు. మండల కేంద్రానికి సమీపంలోని ఎం.కొత్తపల్లి బండపై వెలసిన శ్రీధర్మశాస్త అయ్యప్పస్వామి ఆలయంలో 18 కేజీల కర్పూరాన్ని వెలిగించారు. ఆలయ నిర్మాణ సంకల్పకులు పచ్చర్ల ఆంజనేయులు గురుస్వామి మాట్లాడుతూ ప్రతియేటా జనవరి 14న శబరిమలలో వెలిగే మకరజ్యోతికి చిహ్నంగా ఇక్కడ కూడా అఖండజ్యోతి వెలిగించడం సంప్రదాయంగా వస్తోందన్నారు.

భక్తులతో ఆలయాలు కిటకిట



బత్తలపల్లిలో విశేష పూజలందుకుంటున్న కొల్లాపురమ్మ అమ్మవారు

బత్తలపల్లి: సంక్రాంతి పండుగ సందర్భంగా సోమవారం నుంచి బుధవారం వరకు మండలంలోని వివిధ దేవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ప్రముఖ పుణ్యక్షేత్రమైన సంగమేశ్వర క్షేత్రం, కాటికోటేశ్వర క్షేత్రంతో పాటు పోట్లమర్రి, ముష్టూరు శివాలయాలు, రామాపురం, మాల్యవంతంలోని వీరనారాయణస్వామి, బత్తలపల్లిలోని శ్రీలలితా త్రిపుర సుందరీ సమేతా ఓంకారేశ్వరుడు, కొల్లాపురమ్మ, బళ్లారి దుర్గమ్మ, లక్ష్మివెంకటేశ్వరస్వామి దేవాలయం, దంపెట్ల చెన్నకేశవాలయం, డి.చెర్లోపల్లి సిద్దేశ్వరాలయం, గంటాపురం అప్పస్వామి దేవాలయాల్లో భక్తులు తరలివచ్చి ప్రత్యేక పూజలు చేశారు. బత్తలపల్లిలో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోటి సురేష్, గుమ్మల్లకుంటలో ఎంపీపీ బగ్గిరి త్రివేణి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మాదిరెడ్డి జయరామిరెడ్డి, మాజీ కన్వీనర్ బగ్గిరి బయపరెడ్డి, లింగారెడ్డిపల్లిలో చౌడేశ్వరి అమ్మవారికి వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి గుర్రం శ్రీనివాసరెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

గ్రామాల రూపురేఖలు మారుస్తాం



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సత్యకుమార్

బత్తలపల్లి: ఉపాధి హామీ పథకం నిధుల ద్వారా రహదారులు నిర్మించి గ్రామాల రూపురేఖలు మారుస్తామని మంత్రి సత్యకుమార్ పేర్కొన్నారు. మంగళవారం యర్రాయపల్లిలో రూ.9 లక్షలతో నిర్మించిన సిమెంట్ రోడ్డును ఆయన ప్రారంభించారు. యర్రాయపల్లి నుంచి చియ్యేడు, యర్రాయపల్లి నుంచి జాతీయ రహదారి వరకు సిమెంట్ రోడ్డు ఏర్పాటుకు కృషి చేస్తానన్నారు. గ్రామం పక్కనే వెళ్తున్న పీఏబీఆర్ కుడి కాలువకు పైపులు అమర్చి కుంటలు, చెక్‌డ్యాంలకు నీరు విడుదలయ్యేలా చూస్తానని రైతులకు హామీ ఇచ్చారు. అర్హులైన వారికి నివేశన స్థలాలు ఇచ్చి గృహనిర్మాణాలు చేపడతామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ స్వర్ణలత, ఎంపీడీఓ నరసింహానాయుడు, ఈఓఆర్డీ క్రిష్టప్ప, ఏపీఎం సుదర్శన్‌రాజు, ఏపీఓ ఆదెప్ప పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ బలోపేతానికి సమష్టి కృషి



కోటి సురేష్‌కుమార్‌ను అభినందిస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలు

బత్తలపల్లి: వైఎస్సార్‌సీపీ బలోపేతానికి సమష్టిగా కృషి చేద్దామని జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియమితులైన కోటి సురేష్‌కుమార్ పేర్కొన్నారు. బుధవారం మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో కోటి సురేష్ కుమార్ నివాసానికి తరలివచ్చి అభినందనలు తెలిపారు. బత్తలపల్లి, పోట్లమర్రి, గంటాపురం, లింగారెడ్డిపల్లి తదితర గ్రామాలకు చెందిన సర్పంచ్ అక్కిం దామోదర్, ఎంపీటీసీ సభ్యులు కోటి నరేష్‌కుమార్, నాయకులు యోగానంద ఆచారి, సంద్రా రామకృష్ణ, బిల్లే సూరి, కొంకా గంగాద్రి, బొంతల నారాయణస్వామి, లోకేష్, సాకే సురేష్, సాకే వన్నూరప్ప, షాషు, ప్రసాద్, సాకే కిరణ్, కోటి చంద్ర, నాగరాజు, కొంకా ప్రసాద్, కమతం శంకరయ్య, పాల్యం అప్పస్వామి, జాంపుల చంద్రమోహన్, దేవరకొండ రాముడు, చెడిపోతుల శంకర్, చెడిపోతుల మల్లికార్జున, శంకర్, భాస్కర్, హరి, గంటాపురం పామల్ల నారాయణస్వామి, ముసుగు అప్పస్వామి, మధు, అనిల్, ముఖేష్, ఆదిశేషు, హరి, నాగభూషణ గంగాధర్, బత్తలపల్లి బిల్లే వెంకట్, కోటి మోహన్, బిల్లే శంకర్, మందల నారాయణ, బిల్లే పోతలయ్య, కమతం మల్లేసు, నరిగప్ప, ధనుంజయ, విశ్వనాథ్, మందల వీరప్ప, పెద్దన్న, రవి, మనోహర్, రమేష్, శివ, హరి, లచ్చన్న, నరేష్, కాటమయ్య తదితరులు కలిసి పుష్పగుచ్ఛాలను అందజేసి, శాలువాలతో ఘనంగా సన్మానించారు.

తిరుమల దేవుని సన్నిధిలో సంక్రాంతి సంబరాలు



ప్రత్యేక అలంకరణలో తిరుమలదేవుడు



స్వామివారి గొడుగుల ఊరేగింపు

గాండ్లపెంట: బోయపల్లిలోని తిరుమలదేవుని ఆలయంలో భక్తులు రెండు రోజుల పాటు సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. మంగళవారం ఉదయం నుంచి రాత్రి వరకు ఆలయంలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. సాయంత్రం స్వామివారి గొడుగులను భక్తులు, దేవుని కాపులు ఊరేగింపుగా సమీపంలోని తిరుమల దేవుని కొండపైకి కాలినడకన తీసుకెళ్లారు. అక్కడి ఆలయంలో హారతి వెలిగించి, భక్తులు తలనీలాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. కొండపై రాత్రంతా జాగరణతో పాటు కోలాటాలు, భజనలు చేశారు. బుధవారం రాత్రి బోయపల్లి తిరుమలదేవుని ఆలయంలో ఉన్న శ్రీకృష్ణుని ఉత్సవ విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించి పల్లకీలో గుడి చుట్టూ ప్రదక్షిణలు చేయించారు. భక్తులకు ఎన్పీకుంట గ్రామస్తులు, ఆలయ పూజారుల ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

వాజ్‌పేయి సేవలు మరువలేనివి



విజేత జట్టుకు ట్రోఫీ ప్రదానం చేస్తున్న ఎంపీ లక్ష్మణ్ తదితరులు

కదిరి అర్బన్: భారతరత్న, మాజీ ప్రధాని వాజ్‌పేయి దేశాభివృద్ధికి చేసిన సేవలు మరువలేనివని జాతీయ ఓబీసీ మోర్చా అధ్యక్షుడు, ఎంపీ డాక్టర్ లక్ష్మణ్ పేర్కొన్నారు. బుధవారం కదిరిలోని ఎస్టీఎస్ఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహించిన వాజ్‌పేయి శతజయంతి వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. వాజ్‌పేయి ప్రధానిగా పని చేసిన కాలంలో ప్రధాన మంత్రి గ్రామీణ సడక్ యోజన పేరుతో గ్రామీణ రహదారులు, జాతీయ రహదారులు నిర్మించారన్నారు. నిత్యం మన దేశంపై కాలుదువ్వే పాకిస్థాన్‌కు సైతం స్నేహహస్తం అందించిన మహనీయుడన్నారు. వాజ్‌పేయి గొప్ప కవి, రచయిత అని కొనియాడారు. ఉమ్మడి ఏపీతో వాజ్‌పేయికు ప్రత్యేక అనుబంధం ఉందన్నారు. అంతర్జాతీయ వేదికలో భారత్ ఔన్నత్యాన్ని చాటారన్నారు. ప్రతి ఒక్కరూ వాజ్‌పేయిని స్ఫూర్తిగా తీసుకుని ముందుకెళ్లాలన్నారు. అనంతరం డిగ్రీ కళాశాలలో వారం రోజులుగా నిర్వహిస్తున్న వాజ్‌పేయి మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్ విజేత అంబేద్కర్ లయన్స్ జట్టుకు ట్రోఫీ ప్రదానం చేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ఎంఎస్ పార్థసారథి, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు విష్ణువర్ధన్ రెడ్డి, జిల్లా అధ్యక్షులు శేఖర్, నాయకులు గుడిసె దేవానంద్, యువమోర్చా రాష్ట్ర అధ్యక్షుడు మిట్టా వంశీ పాల్గొన్నారు.

క్రికెట్ విజేత ‘పెడబల్లి సింహ గర్జన’



విజేతలకు నగదు బహుమతితో పాటు మెమొంటో అందజేస్తున్న నిర్వాహకులు

ఎన్పీకుంట: సంక్రాంతి పండుగను పురస్కరించుకుని ముసల్‌రెడ్డి గారి రమేష్‌రెడ్డి జ్ఞాపకార్థం వైఎస్సార్‌సీపీ నాయకుడు, ప్రముఖ పారిశ్రామికవేత్త ముసల్‌రెడ్డిగారి హరీష్‌రెడ్డి పెడబల్లిలో నాలుగు రోజులుగా నిర్వహిస్తున్న డాక్టర్ వైఎస్సార్ మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్ బుధవారం ముగిసింది. ఫైనల్ మ్యాచ్‌లో ఎన్పీకుంట క్రేజీ లెవెన్స్ జట్టుపై 12 పరుగుల తేడాతో పెడబల్లి సింహగర్జన జట్టు గెలిచి ట్రోఫీని సొంతం చేసుకుంది. విజేత జట్టుకు రూ.25వేలు, రన్నర్ జట్టుకు రూ.15వేల నగదు బహుమతితో పాటు మెమొంటోలను అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు ముసల్‌రెడ్డి గారి విశ్వనాథ్‌రెడ్డి, పుల్లారెడ్డి, మహేశ్వరరెడ్డి, శంకర్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, ఉమాశంకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు అన్నదానం



వృద్ధులకు భోజనం వడ్డిస్తున్న డీఎస్పీ విజయకుమార్

పుట్టపర్తి టౌన్: సంక్రాంతి పండుగను పురస్కరించుకుని పుట్టపర్తి సమీపంలో కర్ణాటకనాగేపల్లి వద్ద ఉన్న ప్రేమసాయి సదన్ వృద్ధాశ్రమంలో ఉన్న వృద్ధులకు డీఎస్పీ విజయకుమార్ అన్నదానం చేశారు. వివిధ రకాల వంటకాలను స్వయంగా వడ్డించారు. సత్యసాయిబాబా స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ సేవాగుణం అలవర్చుకోవాలని డీఎస్పీ సూచించారు.

భక్తిశ్రద్ధలతో ఇరుముడి



ఇరుముడితో శబరిమలకు బయల్దేరిన అయ్యప్పస్వామి మాలధారులు

తాడిమర్రి: మండల కేంద్రంలోని అయ్యప్పస్వామి ఆలయంలో బుధవారం గురుస్వామి సత్యనారాయణస్వామి అయ్యప్పస్వామి మాలధారులు మహేశ్వర్‌రెడ్డి, నాగేంద్రరెడ్డి, చంద్ర, ప్రతాప్, రామాంజి తదితర 15 మందికి భక్తిశ్రద్ధలతో ఇరుముడి కట్టారు. భక్తులు అయ్యప్పస్వామి 108 చరణాలు చెబుతూ, పాటలు పాడుతూ భజనలు చేశారు. అనంతరం కర్పూరం వెలిగించి పైడితల్లి (నాట్యం) ఆడుతూ భజనలు చేశారు. తర్వాత శబరిమలకు బయల్దేరారు.

జిల్లా అధికార ప్రతినిధికి సన్మానం



ఫొటో సాయిని సన్మానిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

పుట్టపర్తి టౌన్: వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధిగా నియమితులైన సాయినగర్‌కు చెందిన ఫొటో సాయిని మున్సిపల్ వైస్ చైర్మన్ మాతంగి తిప్పన్న ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ నాయకులు సాయినగర్ యూత్ నాయకులు పూలమాలలు, శాలువతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఫొటో సాయి మాట్లాడుతూ తనమీద నమ్మకం ఉంచి ఎంపిక చేసిన పార్టీ అధ్యక్షుడు, మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి, జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్, మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు. పార్టీ బలోపేతానికి కృషి చేస్తామని తెలిపారు. అనంతరం జిల్లా అధికారి ప్రతినిధి సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్.జె రత్నాకర్‌ను, పార్టీ రాష్ట్ర కార్యదర్శి డీఎస్ కేశవరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ తిప్పన్న, నాయకలు ఎస్టీడీ నరసింహులు, రామయ్య, సాయికుమార్, కుమార్, నరేష్, కేశప్ప, మల్లికార్జున, కేశప్ప, ఆంజనేయులు, ఓబుళేసు, రామాంజనేయులు, పి. సాయికుమార్, భాస్కర్, సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

శిల్పారామంలో సంక్రాంతి సంబరాలు



ప్రేక్షకులను అలరిస్తున్న బుల్లితెర ఆర్టిస్టులు

పుట్టపర్తి రూరల్: శిల్పారామంలో సంక్రాంతి సంబరాలు అంబరాన్నంటాయి. భోగి, సంక్రాంతి, కనుమ పర్వదినాలను పురస్కరించుకొని శిల్పారామంలో మూడు రోజుల పాటు నిర్వహించిన సంబరాలు బుధవారం ముగిశాయి. మంగళవారం సాయంత్రం బుల్లితెర ఆర్టిస్టులు రియాజ్, రాజమౌళి, శాంతిస్వరూప్ కామెడీలు ప్రేక్షకులను అలరించాయి. గణేష్ నృత్య బృందం సాంస్కృతిక కార్యక్రమాలు, నృత్యాలతో ఆకట్టుకుంది. పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

బేల్దారి మృతి



మృతుని కుటుంబ సభ్యులకు ఆర్థికసాయం చేస్తున్న దృశ్యం

ధర్మవరం రూరల్: పోతుకుంట ఎస్సీ కాలనీకి చెందిన బేల్దారి సాకే కాశీనాథ్ (55) అనారోగ్య సమస్యలతో మంగళవారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న సర్పంచ్ నాగవేణి, అంగజాల రాజు దంపతులు మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అంత్యక్రియల నిమిత్తం రూ.5వేల ఆర్థికసాయం అందజేశారు. నివాళులు అర్పించిన వారిలో సాకే చంద్ర, మహేష్, పైటే లక్ష్మీనారాయణ, రామకృష్ణ, రామాంజనేయులు, ప్రసాద్, రామాంజి తదితరులు ఉన్నారు.

సంక్రాంతి సంబరాల్లో మంత్రి



వెయిట్ లిఫ్టింగ్ పోటీలను పర్యవేక్షిస్తున్న మంత్రి

ధర్మవరం: పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో రెండురోజులపాటు నిర్వహించిన సంక్రాంతి సంబరాల్లో మంత్రి సత్యకుమార్ పాల్గొన్నారు. కేరళ వాయిద్యం, చిల్లాకట్టె, బొంగరాలు, కోలాటం, కీలుగుర్రాలు తదితర ఆటలను మంత్రి పర్యవేక్షించారు. హమాలీల వెయిట్ లిఫ్టింగ్ పోటీలను వీక్షించారు. అనంతరం పోటీల్లో గెలుపొందిన హమాలీలకు మొదటి బహుమతి కింద రూ.15వేలు, ద్వితీయ బహుమతి కింద రూ.10వేలు, తృతీయ బహుమతి కింద రూ.5వేల నగదు అందించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ప్రమోద్‌కుమార్ పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్‌కు గాయాలు



గాయపడిన మహేష్

ధర్మవరం అర్బన్: పట్టణంలోని ఎర్రగుంటకు చెందిన ఆటో డ్రైవర్ మహేష్ మంగళవారం తన ఇంటి ముందు ఆటోకు మరమ్మతులు చేస్తుండగా సర్కిల్‌లోనుంచి మోటుమర్ల వైపు వెళ్తున్న ద్విచక్రవాహనం వేగంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో మహేష్‌కు గాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు గమనించి వెంటనే అతడిని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వన్‌టౌన్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

హనుమద్ వాహనంపై లక్ష్మీచెన్నకేశవుడు

చెన్నేకొత్తపల్లి: సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని మండల కేంద్రంలోని లక్ష్మీ చెన్నకేశవ స్వామి ఉత్సవ విగ్రహాన్ని హనుమద్ వాహనంపై మంగళవారం పట్టణంలో భక్తిశ్రద్ధలతో ఊరేగించారు. ఈ సందర్భంగా భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.



బత్తలపల్లిలోని ఓ ఇంటి ముందు ముగ్గుకు రంగులు వేస్తున్న మహిళలు

సరదాల సంక్రాంతి

సాక్షి బృందం : హిందువుల పండుగల్లో ఒక్కటైన సంక్రాంతి ధర్మవరం, కదిరి, పుట్టపర్తి నియోజకవర్గాల్లో సరదాగా సాగింది. సోమవారం భోగి మంటలతో.. మంగళవారం మకర సంక్రాంతి సందర్భంగా ప్రతి ఇంటా రంగవల్లులు, గొబ్బెమ్మల అలంకరణ.. చిన్నారుల నుంచి పెద్దల వరకు గాలిపటాలు ఎగురవేస్తూ సందడి చేశారు. ఇక బుధవారం కనుమ పండుగ సంతోషంగా సాగింది.

రేపు ఉచిత గుండె వైద్య శిబిరం

ధర్మవరం అర్బన్: పట్టణంలోని స్పందన ఆస్పత్రిలో ఈ నెల 17న ఉచిత గుండె వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు వైద్యులు టీఎం బషీర్, వై.సోనియా బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జీఆర్‌బీఎస్, బీపీ, ఈసీజీ, 2డీ ఎకో పరీక్షలు ఉచితంగా చేయనున్నట్లు వివరించారు.

ఘనంగా మాయావతి జన్మదిన వేడుకలు

కదిరి టౌన్: బీఎస్పీ అధినేత్రి మాయావతి జన్మదిన వేడుకలు బుధవారం రాష్ట్ర కార్యదర్శి ఇర్ఫాన్ ఆధ్వర్యంలో కదిరిలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు పట్టణంలో కేక్ కట్ చేసి కార్యకర్తలకు పంచిపెట్టారు.

గరుగుతండాలో చోరీ

ముదిగుబ్బ : గరుగుతండాలో మంగళవారం అర్ధరాత్రి చోరీ జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. తండాలో నివాసముంటున్న బాబ్జి నాయక్ కుటుంబంతో కలిసి బంధువుల ఊరికి వెళ్లాడు. ఇంటికి తాళం వేసి ఉండడం గమనించిన దుండగులు మంగళవారం అర్ధరాత్రి చొరబడ్డారు. తాళం పగులగొట్టి లోనికి ప్రవేశించి బీరువాలోని రూ.40వేల నగదు, రూ.54వేలు విలువ చేసే బంగారు నగలు ఎత్తుకెళ్లారు. బాధితుడు బాబ్జి నాయక్ బుధవారం ఇంటిని పరిశీలించిన అనంతరం చోరీ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేశాడు.